సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



మాయాజాలం..

బొలాకిలో మాయాజాలం నడుస్తోంది. మద్యం సిండికేట్ దందా సాగుతోంది.

- 8లో



ఐదు పేపర్లే రాసి..

మస్క్యులర్ డిస్ట్రోఫీతో బాధ పడుతున్న ఓ బాలిక అద్భుతం చేసి చూపించింది. పది ఫలితాల్లో రాణించింది.

- 8లో

సీఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఇద్దరు సీఐలకు స్థానచలనం చేస్తున్నట్లు విశాఖ రేంజి కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. బారువ సీఎస్‌పీఎస్‌లో ఉన్న డీవీజే రమేష్‌కుమార్ పార్వతీపురం మన్యం జిల్లా డీఎస్‌బీ-2కు బదిలీ కాగా.. అదే స్థానం నుంచి వూయిక రమేష్ బారువ సీఎస్‌పీఎస్‌కు రానున్నారు. శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న బి.రమణమూర్తి విశాఖ రేంజి వీఆర్‌కు, అక్కడే ఉన్న సీహెచ్ రాజశేఖర్ శ్రీకాకుళం వీఆర్‌కు బదిలీ అయ్యారు.

న్యూస్‌రీల్

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం



శాలిహుండం సర్పంచ్ ఆదినారాయణను సత్కరిస్తున్న దృశ్యం

అరసవల్లి: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ చట్టం ఆమోదించిన రోజు సందర్భంగా ఇలా ప్రత్యేక దినోత్సవంగా 2010 నుంచి జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ పరిపాలనా విధానం అమల్లోకి రావడంతో క్షేత్ర స్థాయిలో స్థానిక స్వపరిపాలన సాధ్యమైందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, దారిద్ర్య రేఖ నిర్మూలనకు విధివిధానాల రూపకల్పన, ఉపాధి కల్పన సదుపాయాల కల్పనకు ఈ సవరణ చట్టం ఆమోదంతో ప్రజల జీవన స్థితిగతులను మార్చేందుకు దోహదపడిందని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధిగా గెలుపొందిన తర్వాతే తనకు చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం వచ్చిందని ఇది గర్వంగా చెబుతున్నానని అన్నారు. స్థానికంగా గ్రామ, మండల స్థాయిలో పనిచేసిన అనుభవాలు నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ముందుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయను స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఘనంగా సత్కరించారు. అనంతరం 'స్థానిక' ఉత్తమ పరిపాలకులుగా సేవలందించిన సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పలాస జెడ్పీటీసీ మచ్చ రత్నాలను జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు సంయుక్తంగా సత్కరించారు. అనంతరం గార మండలం శాలిహుండం గ్రామ పంచాయతీని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి ఆ గ్రామ సర్పంచ్ కొంక్యాణ ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. అలాగే ఆ పంచాయతీ అభివృద్ధిని చూపుతూ సర్పంచ్ ఆదినారాయణ, కార్యదర్శి పల్లంటి సురేష్‌లు తయారు చేసిన ప్రత్యేక 'లోగో'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ సర్పంచ్‌లకు కూడా సత్కరించి ప్రత్యేక జ్ఞాపికలను జెడ్పీ చైర్‌పర్సన్ విజయ అందజేశారు.

డీఈఈగా సరస్వతి



డీఈఈగా బాధ్యతలు స్వీకరించిన సరస్వతికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

హిరమండలం: ఎట్టకేలకు గొట్టా బ్యారేజీ రెగ్యులర్ డీఈఈగా బోయిన సరస్వతి నియమితులయ్యారు. నాలుగేళ్ల కిందట డీఈఈగా ఉన్న ప్రభాకర్ బదిలీ అయ్యారు. కానీ ఇంతవరకూ రెగ్యులర్ డీఈఈని నియమించలేదు. ఇన్‌చార్జితోనే కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పుడు పదోన్నతిపై డీఈఈగా సరస్వతిని నియమించారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. వంశధార అధికారులు, సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

పోలెండ్‌లో పలాస యువకుడు మృతి





పార్కులో మృతదేహాన్ని పరిశీలిస్తున్న అక్కడి పోలీసు అధికారులు ఇన్‌సెట్‌లో దామోదర్ (ఫైల్)


కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోట పంచాయతీ ఖైజోల గ్రామానికి చెందిన బుడత దామోదర (33) పోలెండ్ దేశానికి వలస వెళ్లి సోమవారం అక్కడే మృతి చెందారు. ఆ దేశంలో వెల్డర్‌గా పనిచేసేందుకు వెళ్లిన దామోదర అక్కడి పార్కులో ఊయల వద్ద సోమవారం చనిపోయాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దామోదర్‌కు అమ్మ పున్నమ్మ, పెరాలిసిస్‌తో బాధపడుతున్న తండ్రి లక్ష్మీనారాయణ, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పోషణ కోసమే దామోదర్ దేశం వదిలి వెళ్లాడు. ఘటన జరిగి నాలుగు రోజులవుతున్నా మృతదేహం రాలేదు, మృతికి గల కారణాలు కూడా తెలియరాలేదు. దీనిపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు సమాచారం అందించగా.. ఆ దేశ అధికారులతో మాట్లాడారు.

రేషన్ తగ్గించి.. ప్రజలను వంచించి



రణస్థలం మండలం ఎర్రవరం పంచాయతీ చెల్లపేట ఎర్రవరంలో ఏప్రిల్‌కు సంబంధించి రేషన్ ఇవ్వలేదు. ఈ నెల కోటా రాలేదని చెప్పి విచిత్రంగా అక్కడి కార్డుదారులకు బియ్యానికి సంబంధించి కిలోకి ఇంతని డబ్బులు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కూడా ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా జరిగింది.

అదే మండలం దన్నానపేట గ్రామంలో రెండు నెలలుగా రేషన్ పంపిణీ చేయలేదు. మండల కేంద్రం పరిధిలో గల జేఆర్‌పురం పంచాయతీలోని గ్రామమిది. ఇక్కడ కూడా బియ్యం పంపిణీ చేయలేదు. ఇదే విషయమై 'సాక్షి' ఆరా తీయడంతో అప్రమత్తమైన సదరు డీలర్ హుటాహుటీన గురువారం ఉదయం వేరొక చోట నుంచి బియ్యం ప్యాకెట్లు తీసుకొచ్చి పంపిణీ చేశారు.




- కూటమి ప్రభుత్వంలో కార్డుదారులకు కష్టాలు
- ప్రతి నెలా తగ్గిపోతున్న కేటాయింపులు
- కొన్ని గ్రామాల్లో బియ్యం పంపిణీ జరగని పరిస్థితి
- నాలుగు నెలలుగా కందిపప్పు ఊసేలేదు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

రేషన్ కార్డుల సాక్షిగా కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. రేషన్ డిపోల ద్వారా కనీసం బియ్యం పంపిణీ చేయడం లేదు. దీంతో చాలామంది పేద ప్రజలు అవస్థలు పడుతున్నారు. బయట ధరకు కొనుగోలు చేసుకోలేక, రేషన్ డిపోల ద్వారా ప్రభుత్వ బియ్యం అందక ఆకలితో అలమటిస్తున్నారు. ఇందులో సర్కార్ పాపమే కనబడుతోంది. జిల్లాలోని కార్డుదారులకు సరిపడా బియ్యాన్ని సరఫరా చేయడం లేదు. ప్రతి నెలా జిల్లాకు ఇవ్వాల్సిన దాంట్లో కొంతమేర కోత పెడుతోంది. దీంతో తమకు తక్కువ వచ్చిందని డీలర్లు కూడా అదే సూత్రాన్ని అవలంబిస్తున్నారు. ఫలితంగా రేషన్ డిపోల ద్వారా ఎంతమందికి ఎంత బియ్యం ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 1603 రేషన్ డిపోలు ఉన్నాయి. వాటి పరిధిలో 6,60,730 మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 10,678.166 మెట్రిక్ టన్నుల మేర బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తేనే డిపోల ద్వారా కార్డుదారులందరికీ రేషన్ అందుతుంది. కానీ, డిసెంబర్ నుంచి జిల్లాకు బియ్యం కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయి. డిసెంబర్‌లో 10,678.166 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించగా, ఈ ఏడాది జనవరి నాటికి 9,769.277మెట్రిక్ టన్నులకు తగ్గిపోయింది. ఫిబ్రవరికి వచ్చేసరికే 8,882.740 మెట్రిక్ టన్నులు జిల్లాకు రాగా, మార్చి నెలకొచ్చేసరికి 9,694. 486 మెట్రిక్ టన్నులకు తగ్గించేసింది. ఏప్రిల్ కోటాకొచ్చేసరికి 9,056.581 మెట్రిక్ టన్నులకు సరఫరా తగ్గిపోయింది. అంటే దాదాపు ప్రతి నెలా జిల్లాకు రావల్సిన కోటాలో కోత పెడుతూ వస్తోంది.

కందిపప్పు ఎగవేత



ఒక్క బియ్యంలోనే కాదు కందిపప్పు, పంచదార సరఫరాలో కూడా అదే రకంగా కోత పెడుతోంది. పంచదార అరకొరగా సరఫరా చేస్తుండగా, కందిపప్పు అయితే ఏకంగా సరఫరానే నిలిపేసింది. వాస్తవంగా ప్రతికార్డుదారుడికి ప్రతి నెలా అర కిలో పంచదార, కిలో కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ లెక్కన జిల్లాకు 318.770 మెట్రిక్ టన్నుల పంచదార, 653.563 మెట్రిక్ టన్నుల కందిపప్పు రావాల్సి ఉంది. కానీ గత నాలుగు నెలలుగా కందిపప్పు పూర్తిగా సరఫరా చేయడం లేదు. జనవరి నుంచి ప్రభుత్వం సరఫరా నిలిపివేయడంతో రేషన్ కార్డుదారులకు కందిపప్పు అందని పరిస్థితి నెలకుంది. బయట మార్కెట్‌లో ఎక్కువ రేటుకు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితిని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. రేషన్ అరకొరగా ఇస్తుండగా, సరఫరాలోనూ నిర్లక్ష్యం చూపిస్తోంది. గత ప్రభుత్వం ఇంటింటికి ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేయగా, ఇప్పుడు చాలాచోట్ల ఎండీయూ వాహనాలతో కాకుండా రేషన్ డిపోల్లోనే సరఫరా చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. దీంతో రేషన్ కోసం ప్రజలకు మునుపటి కష్టాలు తప్పడం లేదు.

	ప్రతి నెలా జిల్లాకు రావాల్సిన బియ్యం	డిసెంబర్‌లో వచ్చిన బియ్యం	జనవరిలో	ఫిబ్రవరిలో	మార్చిలో	ఏప్రిల్‌లో	జిల్లాకు రావాల్సిన కందిపపప్పు	ప్రస్తుతం వస్తున్నది
మెట్రిక్ టన్నుల్లో	10,678.166	10,678.166	9769.277	8,882.740	9694.486	9056.581	653.563	సున్నా

ఆధిపత్యం కోసమేనా..?

- కార్పొరేషన్‌లో టౌన్ వెండింగ్ కమిటీ ఏర్పాటు
- సభ్యులుగా టీడీపీ నాయకుల నియామకం
- ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతికి చోటు
- వీరితో పాటు నలుగురు నాయకులకు, అధికారులకు కమిటీలో స్థానం
- జనసేన, బీజేపీలకు మొండిచేయి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా కేంద్రంపై ఆధిపత్యం కోసం స్థానికంగా రాజకీయాలు జరుగుతున్నాయి. ఎప్పుడో 2014–19లో జారీ చేసిన గెజిట్‌లు, రూపొందించిన చట్టాలను బయటకు తీసి టౌన్ వెండింగ్ కమిటీ పేరుతో ప్రత్యేక కమిటీని నియమించారు. 13 మంది సభ్యులు గల కమిటీలో ఐదుగురు టీడీపీ నాయకులకు చోటు కల్పించారు. వారిలో ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతే కాదు బీజేపీ, జనసేన నాయకులకు మొండిచేయి చూపడం కూడా సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

ఈ కమిటీ వేసింది కమిషనరే అయినప్పటికీ ప్రతిపాదనలు మాత్రం ముమ్మాటికీ కీలక నేతల ద్వారానే జరిగినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఎమ్మెల్యే సతీమణి స్వాతికి చోటు కల్పించి ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. నగర వెండింగ్ కమిటీలో రూరల్‌కు చెందిన స్వాతిని నియమించడం మరింత చర్చకు దారి తీసింది. వీరితో పాటు ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన అంధవరపు ప్రసాద్, రెడ్డి గిరిజా శంకర్, ఉంగట రమణ, అల్లు నరసనయ్యలకు కూడా కమిటీలో చోటిచ్చారు. టీడీపీ నుంచి ఐదుగురిని సభ్యులుగా నియమించగా, చైర్మన్‌గా కమిషనర్, మిగతా హోదాల్లో వివిధ అధికారులను నియమించారు. ఈ నెల ఒకటో తేదీనే కమిటీ వేసినప్పటికీ ఇప్పుడిది తెరపైకి వచ్చింది. కమిటీ సభ్యులంతా ఇప్పటికే ఒకసారి సమావేశమై, వివిధ అంశాలపై చర్చించినట్టు కూడా తెలిసింది.

చక్రం తిప్పేందుకేనా..?

మొత్తానికి పాలకవర్గం లేని కార్పొరేషన్‌లో వెండింగ్ కమిటీ పేరుతో టీడీపీ నాయకులకు ప్లేస్ కల్పించారు. వారంతా ఏం చేస్తారో అన్నదానిపై ఆసక్తి నెలకొంది. సాధారణంగా కార్పొరేషన్‌లో గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు స్ట్రీట్ వెండర్స్ కమిటీలను నియమించారు. ఇప్పుడా జీఓలను పట్టుకుని టౌన్ వెండింగ్ కమిటీని నియమించినట్టు తెలుస్తోంది. కాకపోతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెండర్స్ పేరు కొత్తగా ప్రచారంలోకి వచ్చింది. వెండర్స్ అంటే సరఫరాదారులు. కానీ, ఇప్పుడు వెండర్స్ అంటే పనులు చేసే వాళ్లుగా చూపిస్తున్నారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు మాదిరిగా టీడీపీ నాయకులను వెండర్స్‌గా అవతారమెత్తించి, వారిని ప్రత్యేకంగా గుర్తించి, పనులు అప్పగించారు. వారిచేతే పనులు చేపట్టి, బిల్లులు వారికే వేసి లబ్ధి చేకూరుస్తున్నారు. పనుల్లో నాణ్యత, లోపాలు, అక్రమాలు పక్కన పెడితే వెండర్స్‌కు తాజాగా రూరల్ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులు కాసులు కురిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌లో తాజాగా నియమించిన టౌన్ వెండింగ్ కమిటీ ఏ రకంగా ఉంటుందో అన్నదానిపై చర్చ జరుగుతోంది. స్ట్రీట్ వెండర్స్ కోసం పనిచేస్తుందా? లేదంటే కార్పొరేషన్‌లో చేపట్టే పనులు, ఇతరత్రా వ్యవహారాలను చూసుకుంటుందా? అన్నదానిపై సందేహాలు ఉన్నాయి. కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే సతీమణి, నగర కీలక నాయకులే ఉండటంతో కార్పొరేషన్ అంతా వారి కనుసన్నల్లో, డైరెక్షన్‌లో నడిచే అవకాశమైతే మాత్రం ఉంటుంది. వారిని దాటి అక్కడేమీ జరిగే అవకాశం ఉండదని చెప్పొచ్చు.

కొత్త నిర్మాణాల కోసమేనా..?

ప్రస్తుతం ఉన్న నగర కార్పొరేషన్ కార్యాలయం స్థానంలో కొత్తగా లీజుదారులతో నిర్మాణం చేపడతారని, కిమ్స్ రోడ్డు, రైతు బజారు కూడలి, కిన్నెర థియేటర్, జిల్లా పరిషత్ ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చి, అక్కడ నిర్మాణాలు చేయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో టౌన్ వెండింగ్ కమిటీ వేయడం, అందులో ఎమ్మెల్యే సతీమణితో పాటు పలువురు కీలక వ్యక్తులను నియమించడం చూస్తుంటే కార్పొరేషన్‌లో ఏదో జరుగుతోందన్న అనుమానాలు వినిపిస్తున్నాయి.



టౌన్ వెండింగ్ కమిటీ సభ్యుల జాబితా

అసభ్యకర ప్రవర్తన.. హెచ్‌ఎంకు దేహశుద్ధి



మొగదాలపాడు యూపీ పాఠశాల వద్ద సోమవారం హెచ్‌ఎంను నిలదీస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

గార: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే తప్పుడు పనులు చేశాడు. చాలాకాలం ఓపిక పట్టిన విద్యార్థినులు తాళలేక తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. వారు వచ్చి హెచ్‌ఎంకు దేహశుద్ధి చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. మండలంలోని వత్సవలస పంచాయతీ మొగదాలపాడు యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొన్ని రోజులుగా 6,7,8 తరగతులకు చెందిన పలువురు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ముద్దులు పెట్టడం, తాకకూడని చోట చేతులు వేయడం చేస్తున్నాడు. కొన్నాళ్లు భరించిన విద్యార్థినులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం చింతాడ వెంకటేశ్వర్లును నిలదీశారు. ఆయన తల్లిదండ్రులతో వాదనకు దిగడంతో వారు హెచ్‌ఎంకు దేహశుద్ధి చేశారు. అనంతరం 1098కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం డిప్యూటీ డీఈఓ విజయకుమారి, చైల్డ్‌లైన్ సిబ్బంది పద్నాలుగు మంది విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులను విచారించారు. జరిగిన సంఘటనపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పాఠశాలలోని మిగిలిన ఉపాధ్యాయులను కూడా విచారణ చేయగా, జరిగిన సంఘటన వాస్తవమేనని అధికారులకు తెలిపినట్టు సమాచారం. విచారణ చేశామని, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, తదుపరి చర్యలుంటాయని ఎంఈఓ నక్క రామకృష్ణ తెలిపారు.

అయితే గురువారం హెచ్‌ఎంతో పాటు మరికొందరు గ్రామానికి విచ్చేసి గ్రామస్తులను కలిసి క్షమించమని వేడుకున్నారు. అయితే బాలికలంతా ఎట్టి పరిస్థితుల్లోనూ చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశ్యంతో పెద్దలు పిలిచినా వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోయారు.

పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే రాజీ ప్రయత్నాలు

హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే అనుయాయుడు కావడంతో ఆయన రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. జరిగింది ఏదో జరిగిందని రాజీ చేసుకోవాలని సూచిస్తుండటం గ్రామంలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

'తాబేళ్ల సంరక్షణ బాధ్యతల నుంచి తప్పకుంటా'

గార: శ్రీకూర్మనాథాలయంలో తాబేళ్ల సంరక్షణ బాధ్యతల నుంచి తప్పుకుంటానని గ్రీన్‌మెర్సీ ప్రతినిధి కేవీ రమణమూర్తి అధికారులకు లేఖ రాశారు. గురువారం జిల్లా అటవీశాఖాధికారి ఎస్.వెంకటేష్, ఆలయ ఈఓ కె.నరసింహానాయుడులకు ఈ మేరకు లేఖను అందజేశారు. అయితే అర్ధంతరంగా మానివేయడం వల్ల తాబేళ్లకు అందాల్సిన ఆహారం, సేవలు నిలిచిపోతాయని ఈఓ తెలిపారు. ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేస్తామని, ఈ నెలాఖరు వరకు నిర్వహణ చూడాలని కోరినట్లు ఈఓ తెలిపారు.

దూరం పెట్టిందని గొంతు కోశాడు



చదివిన ప్రతి తరగతిలోనూ అత్యధిక మార్కులతో పాసైన ఓ కుర్రాడు బెట్టింగ్ అలవాటు మానుకోలేక చదువుకు దూరమై హోటల్‌లో సర్వర్‌గా మారి ఆఖరుకు హంతకుడిగా మిగిలాడు. చెడు సాంగత్యాన్ని మొదటిలోనే తుంచలేక ఓ వివాహిత చేతులారా బంగారం లాంటి బతుకును బుగ్గిపాలు చేసుకుంది. పైడి భీమవరం నడిబొడ్డున జరిగిన యువతి హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేసు వివరాలు తెలిసేకొద్దీ ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.



పైడిభీమవరం హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న జేఆర్ పురం సీఐ అవతారం, పక్కన ఎస్‌ఐ చిరంజీవి

- పైడిభీమవరం హత్య కేసు ఛేదన
- నిందితుడు వీర్రాజు అరెస్టు
- నాలుగు నెలలుగా హతురాలితో పరిచయం
- బెట్టింగులకు అలవాటు పడి భవిష్యత్ నాశనం

రణస్థలం: పైడిభీమవరంలో ఊరి నడిబొడ్డున ఈ నెల 19న జరిగిన అవాల భవానీ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని జేఆర్ పురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎం. అవతారం గురువారం వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

అవాల భవానీ పైడిభీమవరంలోని ఓ హోటల్‌లో పనిచేసేది. అక్కడే సర్వర్‌గా పనిచేస్తున్న కొండక వీర్రాజు అనే వ్యక్తితో నాలుగు నెలల కిందట ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విష యం హోటల్ యజమానికి తెలియడంతో వీర్రాజు ను పనిలో నుంచి మాన్పించేశారు. ఆ తర్వాత భవానీ ఈ విషయం తమ ఇంటిలో తెలిసిపోతుందని వీర్రాజును దూరం పెట్టింది. ఫోన్ చేసినా మాట్లాడకపోవడంతో వీర్రాజు ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. మరొకరితో అక్రమ సంబంధం ఉండడం వల్లనే తనను దూరం పెడుతోందని భావించి ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఈ నెల 19న పైడిభీమవరంలోని ఒక దుకాణంలో చాకు కొను క్కుని తన దగ్గర ఉంచుకున్నాడు. పైడిభీమవరం నడిబొడ్డున ఉన్న గుర్రమ్మ గుడి వెనుక ఉన్న కాజావారి కోనేరుగట్టు వద్ద అవాల భవాని రావడం గమనించి ఆమెను పిలిచి కొంత సమయం గొడవ పడ్డాడు. అయితే ఆమె అతడితో మాట్లాడేందుకు నిరాకరించింది. దీంతో తనతో తెచ్చుకున్న చాకుతో భవాని గొంతును రెండు సార్లు బలంగా కోసినట్లు పోలీసులు తెలిపారు. తర్వాత అక్కడ నుంచి పారిపోయిన వీర్రాజు విజయవాడలోని ఇంటికి చేరుకుని ఎవరూ గుర్తు పట్టకుండా గుండు గీసుకుని తిరుపతి వెళ్లిపోయాడు. తిరిగి వస్తుండగా పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు రణస్థలం మండలంలోని కమ్మసిగడాం వద్ద అదుపులోకి తీసుకున్నారు. కేసును త్వరగా ఛేదించి జేఆర్ పురం సీఐ అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి, సిబ్బంది పి.హేమంత్ కుమార్, కేకే సింగ్, సీహెచ్ సురేష్‌ను జిల్లా ఉన్నతాధికారులు ప్రశంసించారు.

అన్నింటిలోనూ టాపరే..

ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు కొండక వీర్రాజు స్వగ్రామం విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో గల నడిపల్లి గ్రామం. కుటుంబ సభ్యులతో చిన్నతనం నుంచి విజయవాడ వలస వెళ్లి అక్కడే ఉండేవాడు. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు అక్కడే చదువుకున్నాడు. పదిలో పదికి పది, ఇంటర్‌లో 965 మార్కులు, డిగ్రీ రెండేళ్లలోనూ 90శాతం మార్కులు సాధించాడు. డిగ్రీ చివరి ఏడాదిలో బెట్టింగులకు అలవాటు పడి డబ్బులు అప్పు చేసి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో అన్నదమ్ములు నాలుగు నెలలు క్రితం స్వగ్రా మం నడిపిల్లి పంపించేశారు. తదుపరి నడిపిల్లి వచ్చిన అతను పైడిభీమవరంలోని ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిలో జాయినయ్యాడు. అంత తెలివైన విద్యార్థి బెట్టింగ్ మానుకోలేక ఆఖరుకు హంతకుడిగా మిగిలాడు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల



ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని శ్రీకాకుళం, నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో (ట్రిపుల్ ఐటీలు) ప్రవేశానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సండ్ర అమరేంద్రకుమార్ గురువా రం నోటిఫికేషన్ జారీ చేశారు. 10వ తరగతి ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ సైతం విడుదల చేశా రు. ఈ నెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తు స్వీకరణకు మే 20 చివరి తేదీ. విద్యార్థులు ఒకే దరఖాస్తులో క్యాంపస్‌లు ప్రాధాన్యత బట్టి ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. 10వ తరగతి మార్కులు, రి జర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పి స్తారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వెయిటేజ్ ఇస్తారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో గత ఏడాది 1100 సీట్లుకు ప్రవేశాలు కల్పించారు. 1000 సీట్లు, 100 ఈడబ్ల్యూఎస్ సీట్లు ఉన్నా యి. ఈ ఏడాది సీట్ల సంఖ్య స్పష్టంగా తెలియా ల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా ఎంపికవుతున్నారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు వస్తే రెండేళ్ల పీయూసీ (ప్రీ యూనివర్సిటీ కోర్సు), నాలుగేళ్ల ఇంజినీరింగ్ ఆరేళ్లు చదివే అవకాశం లభిస్తుంది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఏటా ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. బాలికలు ఎక్కువగా ప్రవేశాలు పొందుతున్నారు.

రైతులు ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవాలి



యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న వ్యవసాయాధికారి

నరసన్నపేట: రైతుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, దీన్ని ప్రతి రైతూ డౌన్‌లోడ్ చేసుకొని ఆన్‌లైన్ సేవలు పొందాలని నరసన్నపేట వ్యవసాయ అధికారి కె.సునీత తెలిపారు. నేషనల్ టెస్ట్ సర్వేలెన్స్ సిస్టం అనే యాప్‌ను రైతులు డౌన్‌లోడ్ చేసుకుంటే, ఇందులో రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు ఆయా శాస్త్రవేత్తలు నుంచి పొందవచ్చని తెలిపారు. మడపాం రైతు సేవా కేంద్రంలో కొందరు రైతులతో యాప్ డౌన్‌లోడ్ చేయించి దీనిపై గురువారం అవగాహన కలిగించారు. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో 40 మంది రైతులతో ఈ నెలాఖరుకల్లా యాప్ డౌన్‌లోడ్ చేయించాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు టార్గెట్ ఇచ్చామన్నారు. ఈ యాప్‌లో తమ పంట పొలాల్లో ఉన్న తెగుళ్లు, పురుగులు, భూమిలో లోపాలు వంటివి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తే ఆయా విభాగాల శాస్త్రవేత్తలు వెంటనే స్పందించి తగు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. రైతులకు ఈ యాప్ ఎంతగానో ఉపకరిస్తుందని ఆసక్తి గల రైతులు అందరూ తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

పల్లెనిద్రలో ఎమ్మెల్యేను నిలదీసిన మహిళ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : బూర్జ గ్రామంలో ఈ నెల 21న జరిగిన పల్లె నిద్ర కార్యక్రమానికి హాజరైన ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌కు బొమ్మాళి రేవతి అనే మహిళ సమస్యలపై నిలదీసింది. ఉపాధి పనులు చేపట్టినప్పుడు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని, సకాలంలో బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. పార్టీలకతీతంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్నారు.

పాలిసెట్ హాల్‌టికెట్లు సిద్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ పాలిసెట్ – 2025కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ బి.జానకిరామయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీవోఎల్‌వైసీఈటీఏపీ.ఎన్‌ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల ని సూచించారు. ఈ నెల 30న పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

కూర్మనాథాలయ ఈఓగా బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో నరసింహనాయుడు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథాలయ ఈవోగా కె.నరసింహ నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లగా శ్రీకూర్మంతో పాటు రావివలస, పలాస గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌కు ఇన్‌చార్జి ఈవోగా గురునాథరావు వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల తాబేళ్ల దహనం ఘటన చోటుచేసుకోవడంతో దేవదాయశాఖ ఎట్టకేలకు రెగ్యులర్ ఈఓ నియామకం చేపట్టింది. ఈ సందర్భంగా నరసింహనాయుడు తాబేళ్ల పార్కు, ఆలయ క్యూలైన్లు, నిత్యాన్నదాన సత్రాలను పరిశీలించారు.

10, 11వ తేదీల్లో సాహితీ సంబరాలు


సాహితీ సంబరాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏలూరులో శ్రీ శ్రీ కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో మే 10, 11వ తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు సంబంధించి స్వగత పత్రాలను గురువారం శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ ఆవిష్కరించారు. సంబరాల్లో పాల్గొంటున్న వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, ప్రొఫెసర్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, సంక్షేమ డీన్ రవి, తెలుగు బోధకులు పెద్దింటి ముకుందరావు, పి.చిరంజీవిరావు, రాకోటి శ్రీనివాసరావు, కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు వేమన, రచయిత జంధ్యాల శరత్‌బాబు పాల్గొన్నారు.

సీఎం భద్రతా ఏర్పాట్ల సమీక్ష


భద్రతా ఏర్పాట్లు సమీక్షిస్తున్న ఉన్నతాధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 26న ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు సమీక్ష నిర్వహించారు. అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్‌పై సీఎం ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అడిషనల్ ఎస్పీ ఎ.వి.రమణతో చర్చించారు. హెలిప్యాడ్, డయాస్, సభ నిర్వహణపై సమీక్షించారు. పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.

వితంతు పింఛన్లు మంజూరు

శ్రీకాకుళం పాతబస్టాండ్: 2024 జనవరి నుంచి అక్టోబర్ మధ్య వితంతువులకు పింఛన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం మెమో విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాలో 4,623 మంది వితంతువులకు గాను రూ.1,84,92,000 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

25 శాతం ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్12(1) సి ప్రకారం 2025-26 విద్యాసంవత్సరంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల విద్యార్థులు సమీప ప్రాంతంలోని అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయకర్త ఎస్.శశిభూషణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు 25 శాతం కోటా కింద ప్రవేశం పొందడానికి పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, పూర్తి వివరాలకు 9703585990 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మద్యం సిండికేట్.. మాయాజాలం

- లైసెన్స్‌డ్ వైన్‌షాపుల వద్ద 'ఓపెన్ డ్రింకింగ్' కేసుల నమోదు
- పరోక్షంగా బెల్టుషాపుల్లో విక్రయాలు పెరిగేలా స్కెచ్
- బెల్టు నిర్వాహకులతో కుమ్మక్కై జేబులు నింపుకుంటున్న వైనం



బెలమర జంక్షన్‌లోని లైసెన్స్‌డ్ వైన్స్‌షాప్

పోలాకి :

మండలంలో మద్యం సిండికేట్ దందా సాగుతోంది. వైన్‌షాపులు నడిపేవారు సిండికేట్‌గా ఏర్పడి మందుబాబుల జేబులు గుల్లజేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు, కొందరు పోలీసులు, ఎక్సైజ్ అధికారుల సహకారం పుష్కలంగా లభిస్తుండటంతో యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. పోలాకి మండలంలో బెలమర, జడూరు, ఈదులవలస జంక్షన్‌లతో పాటు మండలకేంద్రం పోలాకితో కలిపి మొత్తం 5 లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో 31 పంచాయతీల్లో అనధికారికంగా దాదాపు 40 బెల్ట్ దుకాణాలు నడుస్తున్నట్లు సమాచారం. వీ టన్నింటినీ ఒకే సిండికేట్ కిందకు తీసుకురావటంలో ఎవరి పాత్ర మేర వారు కీలకంగా వ్యవహరించారు.

బెల్టును ప్రోత్సహించేలా..

కూటమి ప్రభుత్వం వచ్చాక బెల్టుషాపు లేని ఊరు లేదనేది బహిరంగ రహస్యమే. బడ్డీకొట్లు, నివాసాలు, వీధి సందులు.. ఇలా ఎక్కడ చూసినా బెల్టు షాపులే కనిపిస్తుంటాయి. అక్కడే దర్జాగా మద్యం సేవిస్తున్నా ఎక్సైజ్ అధికారులు గానీ, పోలీసులు గానీ పట్టించుకోరు. అదే లైసెన్స్‌డ్ దుకాణాల వద్ద తాగితే మాత్రం ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేస్తుంటారు. ఇక్కడే అసలైన మతలబు ఉంది. మందుబాబులు నేరుగా వైన్స్‌షాపుల దగ్గర కొనుగోలు చేసే దాని కన్నా బెల్ట్ నిర్వాహకుల వద్ద కొనుగోలు చేస్తేనే సిండికేట్‌కు హోల్‌సేల్‌గా లాభం వస్తుంది. ప్రతి సీసాపైనా ఎంఆర్‌పీ కంటే అదనపు సొమ్మును బెల్ట్ నిర్వాహకులు అందజేస్తారు. అదే నేరుగా లైసెన్స్‌డ్ షాపుల వద్ద మందుబాబులకు విక్రయిస్తే వారు తాగిన దానికన్నా వాగిందే ఎక్కువ ఉంటుంది. దీంతో అధికార పార్టీకి చెందిన కింది స్థాయి నాయకులు బెల్టు దుకాణాలకు గిరాకీ పెరిగేలా ఈ స్కెచ్ వేశారనే అనుమానాలు వినిపిస్తున్నాయి.

ఎక్కడికక్కడే విచ్చలవిడిగా..

- పోలాకి మండలంలో బెల్ట్‌దుకాణాలు ఎక్కికక్కడే విచ్చలవిడిగా ఉన్నా అటువైపు కనీసం కన్నెత్తిచూడకుండా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును చాలా మంది ప్రశ్నిస్తున్నారు.
- తీరప్రాంత గుప్పెడుపేటలో నెలకు రూ.30 వేలు వరకు వేలంపాట పెట్టుకుని మరీ కూటమి నాయకులు ప్రత్యేక బెల్ట్‌షాపు నడుపుతున్నారు.
- జడూరు జంక్షన్‌లో ఓ దాబాలో అక్కడే ఉన్న లైసెన్స్ వైన్‌షాప్ కన్నా ఎక్కువ ధరకు మద్యం ఏరులై పారుతున్నా కనీసం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.
- వ్యాపార కేంద్రం పిన్నింటిపేట, మండలకేంద్రం పోలాకిలో బెల్ట్ దుకాణాలకు నేరుగా సరఫరా చేసే వ్యక్తులు ఏ సిండికేట్‌కు చెందినవారో పోలీసులే తేల్చాలని పలువురు కోరుతున్నారు.
- జొన్నాం తోటల్లో నేటికీ నాటువాసన పోవడం లేదని అక్కడి వారి మాట. అయినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు.

కఠినంగానే ఉంటున్నాం..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఓపెన్ డ్రింకింగ్‌పై కేసులు నమోదు చేస్తున్నాం. గ్రామాల్లోనూ సిబ్బందిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు సైతం కడుతున్నాం. ప్రజలకు ఇబ్బంది కలిగించే బెల్ట్ దుకాణాలపై కూడా చర్యలు తీసుకుంటాం.

– జి.శ్రీనివాసరావు, సీఐ, నరసన్నపేట

అడ్డగోలు దోపిడీ..



ప్రభుత్వ మద్యం పాలసీ బెల్టు నిర్వాహకులకు వరంగా మారింది. లైసెన్స్ దుకాణాల వద్ద పోలీసు కేసుల నేపథ్యంలో ఎక్కువ మంది గ్రామాల్లో బెల్ట్ దుకాణాలపై ఆధారపడుతున్నారు. అక్కడ క్వార్టర్‌పై రూ.40 నుంచి రూ.60 వరకు అదనపు దోపిడీ జరుగుతంది. సిండికేట్‌కు సైతం ఇదే అవకాశంగా మారింది. బెల్ట్ దుకాణాలపై చర్యలు తీసుకోకపోతే గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం వుంది.

– రెంటికోట త్రినాథరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, పోలాకి

తమ్మినేనికి చింతాడ అభినందనలు


తమ్మినేని సీతారాంకు అభినందనలు తెలుపుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మాజీ స్పీకర్, శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాంను ఇటీవల వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్‌గా పార్టీ అధిష్టానం నియమించిన సందర్భంగా ఆమదాలవలస పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ గురువారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు సాధు కామేశ్వరరావు, నాయకులు ఎస్.రామారావు, పొన్నాడ చిన్నారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐదు పేపర్లే రాసి.. అద్భుత ఫలితాలు సాధించి..


ఖనీజ్ ఫాతిమా కత్రి

పొందూరు: పదో తరగతి ఫలితాల్లో పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఖనీజ్ ఫాతిమా కత్రి అరుదైన ఘనత సాధించింది. చిన్నప్పటి నుంచే కండరాల క్షీణత (మస్కులర్ డిస్ట్రోఫీ) వ్యాధితో బాధపడుతున్న ఈ అమ్మాయి ఎవరైనా తోడు ఉంటేనే పాఠశాలకు వెళ్లే పరిస్థితి. అయినప్పటికీ కుంగిపోకుండా మొక్కవోని దీక్షతో చదువును కొనసాగించింది. నడవలేని పరిస్థితి అయినప్పటికీ పట్టుదలతో చదివింది. ప్రభుత్వం ఐదు పేపర్లు రాసేందుకు అనుమతి ఇవ్వడంతో 500 మార్కులకు గాను 479 మార్కులు సాధించి స్ఫూర్తిగా నిలిచింది. విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు నజీర్ ఖత్రి, సమీర ఖత్రిలను ఎంఈవోలు గట్టు శ్రీరాములు, పట్నాన రాజారావు, హెచ్ఎం వెంకట్రావు, సిబ్బంది అభినందించారు.

వక్ఫ్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలి


నగరంలో ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వక్ఫ్ సవరణ చట్టం-2025కు వ్యతిరేకంగా గురువారం జిల్లా ముస్లింల ఐక్య సమాఖ్య జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా కాశ్మీర్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు నివాళులు అర్పించారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం ఏడు రోడ్ల కూడలిలో బయలుదేరి కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు జిల్లా ముస్లిం ఐక్య సమాఖ్య జేఏసీ నాయకులు శ్రీనివాసరావు, సలీం, హాజీ అమీరుల్లా బేగ్, రఫీ, మహీబుల్లా ఖాన్, ముజీబ్, అక్బర్‌బాషా, మహిళా సోదరీమణులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త చట్టం ముస్లింల హక్కులను కాలరాస్తుందన్నారు. భవిష్యత్తులో ముస్లింల మనుగడకే ఇబ్బందిగా మారే చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ముస్లింల ర్యాలీకి అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు, సీఐటీయూసీ, ఏఐటీయూసీ నాయకులు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మంగరాజు

కంచిలి: కంచిలిలో 12 కిలోల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసినట్లు సోంపేట సీఐ బి. మంగరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం కంచిలి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సోంపేట రైల్వేస్టేషన్ క్వార్టర్స్ వద్ద ఆటోలో ఓ వ్యక్తి గంజాయితో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. గంజాం జిల్లా ఎండ్రిమ గ్రామానికి చెందిన అనిల్‌నాయక్ వద్ద 12 కిలోల గంజాయితో బ్యాగ్ దొరికింది. వెంటనే యువకుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు కేజీల గంజాయితో..

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో గురువారం ముగ్గురు యువకులను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. రెండు బ్యాగులలో 6.38 కేజీల గంజాయి, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి



కశ్మీర్‌లో ఉగ్రవాదుల నరమేధంలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుద ముట్టించాలని జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా జిల్లా కోర్టులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల చర్యలు పిరికితనంలో చేసినవని అన్నారు.

–శ్రీకాకుళం పాతబస్టాండ్

అగ్నికి ఆహుతైన ఎర్రచందనం చెట్లు


ఎర్రచందనం తోటలో అగ్నిప్రమాదం


బాధితుడు సత్యరాజ్‌కు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి: కోటబొమ్మాళి మండలం శ్రీజగన్నాథపురం పంచాయతీ బిర్లంగిపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నూక సత్యరాజ్‌కు చెందిన సుమారు 2 ఎకరాల ఎర్ర చందనం తోటలో గురువారం రాత్రి అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, కోటబొమ్మాళి మండల కన్వీనర్ సంపతిరావు హేమసుందర్‌రాజు, జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు పేడాడ వెంకటరావు, సత్తారు సత్యం తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు సత్యరాజ్‌కు అండగా నిలిచారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే ఇలా వికృత చేష్టలకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై పూర్తి దర్యాప్తు చేసి బాధితుడికి న్యాయం చేయాలని నాయకులు కోరారు.

కల్యాణం..కమనీయం..



అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణ సేవ గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. చైత్ర బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉషా పద్మిని ఛాయాదేవేరులతో శ్రీవారి కల్యాణమూర్తులను అనివెట్టి మండపంలో కొలువు దీర్చి ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణం జరిపించారు. రూ.500 చెల్లించిన భక్త దంపతులకు ఆలయం తరపున స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

– అరసవల్లి

విద్యాశాఖ అధికారులు ఏకపక్ష నిర్ణయాలు వీడాలి

శ్రీకాకుళం: రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా మౌఖిక ఆదేశాలతో ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడం ఎంత వరకు సమంజసమని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ప్రశ్నించారు. గురువారం వారు మాట్లాడుతూ నిన్నటి వరకూ హైస్కూల్లో ఉన్న ప్రైమరీ తరగతుల్లో రోల్ 40 దాటితే 5 ఎస్జీటీలు ఇస్తామని, ఇప్పుడు 31 నుంచి 59 వరకు నాలుగు ఎస్జీటీలు ఇస్తామని వర్క్ షీట్ విడుదల చేయడం తగదన్నారు. యూపీ పాఠశాలపై పూర్తిగా కక్ష కట్టారని 6,7,8 తరగతిలో ఎంత మంది పిల్లలు ఉన్నా స్కూల్ అసిస్టెంట్లు మిగిలితేనే ఇస్తామని మోసకారి మాటలు చెబుతుండటం సరికాదన్నారు. యూపీ పాఠశాలలో 6, 7, 8వ తరగతులలో 31 మంది విద్యార్థులున్నా 139 మంది విద్యార్థులున్నా నలుగురు ఎస్జీటీలనే కేటాయిస్తామనడం భావ్యం కాదన్నారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలను వీడాలని విజ్ఞప్తి చేశారు.

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న పలువురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులు (ఏవో)గా పదోన్నతులు కల్పిస్తూ నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం అందజేశారు. సీతంపేట మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్ ఎ.లోకేశ్వరరావుకు రాజాం మండలపరిషత్ కార్యాలయ ఏఓగా, వంగర మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ జి.సత్యనారాయణను జలుమూరు మండల పరిషత్ ఏవోగా, కోటబొమ్మాళి మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ బి.పార్వతీశంను నందిగాం మండల పరిషత్ ఏఓగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అలాగే కారుణ్య నియామకం కింద కవిటి మండలం రాజపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బంగారి శిరీషకు ఆఫీస్ అసిస్టెంట్‌గా ఉద్యోగాన్ని కల్పిస్తూ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీఈవో శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం


మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్. పక్కనే మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ తదితరులు

- సూపర్‌సిక్స్ పేరిట జనం చెవిలో పువ్వులు పెట్టారు
- జి.సిగడాం మండల విస్తృత స్థాయిలో సమావేశంలో ధర్మాన కృష్ణదాస్, కిరణ్


హాజరైన పార్టీ శ్రేణులు

జి.సిగడాం: ఎన్నికల ముందుకు కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కాక అమలు చేయకుండా ప్రజల చెవిలో పువ్వులుపెట్టారని, ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పుతారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం జి.సిగడాం రైల్వేస్టేషన్ సమీపంలో మండల నూతన కార్యవర్గ సభ్యులతో విస్తృత స్థాయి సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలైనా ఇంత వరకు పేదల కోసం ఒక్క సంక్షేమం పథకం అమలు చేయలేదన్నారు. ప్రజల ను మోసగించడమే చంద్రబాబు నైజమని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంద పేర్కొన్నారు. ప్రభుత్వం వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. గ్రామస్థాయిలో సైనికుల్లా పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

సనాతన ధర్మ ప్రతినిధి ఎక్కడ?

సనాతన ధర్మం ప్రతినిధిగా కోసం గొప్పలు చెప్పుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తిరుపతిలో గోవులు మృత్యువాత, శ్రీకూర్మంలో నక్షత్రాల తాబేళ్ల మృత్యుత వాతం పడితే ఎందుకు నోరు విప్పడం లేదని కిరణ్ ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల రామకృష్ణారావు, జిల్లా అధికార ప్రతినిధి సనపల నారాయణరావు, జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, కార్యవర్గ సభ్యులు పిల్లల శివకుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ కాయల రమణ, మీసాల సీతంనాయుడు, వైస్ ఎంపీపీలు మీసాల సాధ్వీమణి, తోలేటి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు డోల వెంకటరమణ, బోర సాయిరాం, దన్నాన రాజినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేదెన్నడు?


మామిడి శ్రీకాంత్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 11 నెలలు కావస్తున్నా ఒక్క హామీ కూడా అమలుచేయకుండా అప్పుల లెక్కలు చెబుతూ కాలం గడిపేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సంక్షేమం గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షసాధింపులకు పాల్పడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం తగదన్నారు. నాయకుడంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా ఉండాలని, హామీలన్నీ అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే అమలుచేశారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు అధికార దాహంతో బూటకపు హామీలిచ్చిప్రజల్ని మోసగించారని దుయ్యబట్టారు.